# తెదేపాలోనే తలసాని

- తెలంగాణపై సర్దిచెప్పిన బాబు
- 'గ్రేటర్' ఎన్నికలపై దృష్టి పెట్టాలని సూచన

హైదరాబాద్, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీలో చర్చనీయాంశంగా మారిన సీనియర్ నేత తలసాని శ్రీనివాసయాదవ్ వ్యవహారం సద్దుమణిగింది. తెలంగాణ విషయంలో పార్టీ నిర్ణయాన్ని విభేదించి వారం రోజుల క్రితం తలసాని మీడియా ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. పార్టీ అధినేత చంద్రబాబునాయుడుతో గురువారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. చంద్రబాబు ఇంట్లో జరిగిన ఈ భేటీలో మరో సీనియర్ నేత యనమల రామకృష్ణుడు కూడా పాల్గొన్నారు. ప్రత్యేక తెలంగాణకు మద్దతునిస్తూ పార్టీ నిర్ణయం తీసుకోవడంపై చర్చించారు. ఈ విషయమై పునరాలోచించాలని, లేకపోతే గ్రేటర్ ఎన్నికల్లో పార్టీకి ఇబ్బందులు తప్పవని తలసాని చంద్రబాబుకు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితులను సమీక్షించుకుని తెలంగాణపై ఓ నిర్ణయం తీసుకున్నామని చంద్రబాబు ఆయనకు గుర్తు చేశారు. తెలంగాణ ప్రజల్లో బలంగా ఉన్న సెంటిమెంటును గౌరవించి ఈ నిర్ణయం తీసుకున్నామని గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల కోసం దాన్ని మార్చుకోవడం సరికాదని సర్ది చెప్పారు. తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండాలి కదా? అని పేర్కొన్నారు. 'తెలంగాణ విషయంలో నా అభిప్రాయమైతే మీకు చెప్పాను' అని తలసాని చంద్రబాబుతో అన్నట్లు తెలిసింది. చివరగా 'దీనిపై పార్టీ ఆలోచిస్తుంది... గ్రేటర్ ఎన్నికల్లో పూర్తిస్థాయిలో పనిచెయ్' అని చంద్రబాబు తలసానికి సూచించినట్లు సమాచారం.

**పార్టీ నిర్ణయం మేరకు పనిచేస్తా:** అనంతరం తలసాని విలేఖరులతో మాట్లాడుతూ పార్టీ నిర్ణయం మేరకు పనిచేస్తానని పేర్కొన్నారు. తెలంగాణ విషయంలో పార్టీ నిర్ణయంపై తాను మాట్లాడటమేమీ వివాదం కాదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తాను పదవులను కోరుకుంటే చంద్రబాబుతో కొట్లాడైనా సాధించుకోగలనని తెలిపారు.